'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

రేవంత్‌కు సుప్రీం అక్షింతలు

మనదేశ పరిపాలనా వ్యవస్థలో అతి ముఖ్యమైనవి శాసన, ప్రభుత్వ, న్యాయవ్యవస్థలు. శాసనవ్యవస్థ చట్టాలు చేస్తే పరిపాలనా వ్యవస్థ అంటే ప్రభుత్వం అమలుచేస్తుంది. ఆ అమలు అనేది సవ్యంగా ఉందా లేదా? అనేది పరకాయించి నిగ్గు తేలుస్తుంది న్యాయవ్యవస్థ. సాధారణంగా న్యాయస్థానాలు, ముఖ్యంగా సుప్రీంకోర్టు ఉన్నత పరిపాలనా పదవులు నిర్వహించేవారి గురించి ప్రతికూల వ్యాఖ్యలు చేయవు. ఇదంతా మర్యాదస్థుల సంగతి. కానీ, మన ప్రస్తుత సీఎం రేవంత్‌కు ఇవన్నీ పట్టవు. దారినపోయే దానయ్యలు ఏమైనా మాట్లాడుకోవచ్చు. అదే తరహాలో ఒక సీఎం నేలబారుగా మాట్లాడి తే నప్పదు. రాజకీయ ప్రత్యర్థులపై చేస్తున్న బజారుస్థాయి విమర్శల సంగతి పక్కన పెడదాం. న్యాయవ్యవస్థకు సంబంధించిన అంశాలపైనా అసందర్భంగా అవాకులూ, చవాకులూ మాట్లాడితే ఎలా? మొన్నకు మొన్న ఆయన ఫిరాయింపు ఎమ్మెల్యేల గురించి, అదీ అసెంబ్లీ వేదికగా, మరీ ముఖ్యంగా కోర్టు పరిశీలనలో ఉన్న అంశం గురించి తూలిన మాటలు పరాకాష్ఠగా చెప్పవచ్చు. ఆ వ్యాఖ్యలపై సర్వోన్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టు విచారణలో ఉన్న వ్యవహారంపై ఎవరూ ఏమీ మాట్లాడొద్దనే నియమం ఎప్పటి నుంచో ఉన్న ది. ఇక ఉన్నత పదవుల్లో ఉన్నవారైతే అసలు మాట్లాడొద్దు. మరి సీఎం రేవంత్ జంపింగ్ జపాంగ్‌లకు 'మీకేం కాదు, ఎన్నికలు రావు' అని భరోసా ఇవ్వడం ఏమిటి? సుప్రీంకోర్టు దీనిపై కొంచెం ఘాటుగానే స్పందించింది. రాజ్యాంగాన్ని కాపాడుతానని ప్రమాణం చేసిన సీఎం అదే రాజ్యాంగంలోని పదో షెడ్యూల్‌ను, దాని కింద జరుగుతున్న విచారణ క్రమాన్ని తోసిరాజని ఎలా అంటారు. ఇది ఆ షెడ్యూల్‌ను అవమానించడమేనని సుప్రీంకోర్టు పేర్కొనడం గమనార్హం.

అయినా సుప్రీంకోర్టు సీఎం రేవంత్‌కు మొట్టికాయలు వేయడం ఇదే మొదటిసారి కాదు. సుదీర్ఘ విచారణ క్రమం తర్వాత బెయిలు మంజూరైతే అది ఏదో రాజకీయ కారణాలతో ఇచ్చినట్టుగా ఇష్టారాజ్యంగా మాట్లాడిన తీరుపై కోర్టు మండిపడింది. ఆయన తన తప్పు తెలుసుకుంటాడనే ఉద్దేశంతో బహుశా మందలించి విడిచిపెట్టింది. తదనంతరం సీఎం రేవంత్ కూడా జరిగిందానికి బేషరతుగా విచారం వ్యక్తం చేస్తూ 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. న్యాయవ్యవస్థ స్వతంత్రత పట్ల తనకు అపారమైన గౌరవ, ప్రపత్తులున్నట్టుగా అందులో చెప్పుకొన్నారు కూడా. కానీ, అవేవీ గుండె లోతుల్లోంచి రాలేదని, ఆయన బుద్ధి మారలేదని అసెంబ్లీలో చేసిన వ్యాఖ్యల ఉదంతం స్పష్టం చేసింది. అందుకే సుప్రీంకోర్టు పోయినసారి వదిలిపెట్టి తప్పు చేశామా? అని విస్మయం వ్యక్తం చేసింది. ఇది సీఎం దిగజారుడు వ్యాఖ్యానాలకు చెంపపెట్టు లాంటిదని చెప్పకతప్పదు.

ఇలా రెండుసార్లు న్యాయవ్యవస్థ తీవ్రమైన ఆగ్రహానికి కారణమైన సీఎం మరొకరు ఉండరేమో. ఓ వైపు సీఎం స్థాయి వ్యక్తి ఇలా న్యాయవ్యవస్థతో పరిహాసాలాడుతుంటే మరోవైపు న్యాయవ్యవస్థనే తప్పుపట్టే పాత్రికేయులు తయారవుతున్నారు. కంచ గచ్చిబౌలి విధ్వంసంపై సుమోటోగా కేసును చేపట్టిన సుప్రీంకోర్టు వైపు వేలెత్తి చూపే రాతలను వండివారుస్తున్నారు. ఆర్థిక ప్రయోజనాలో లేక ప్రభుత్వ ప్రాపకమో, వెనుకనున్న విషయం ఏదైనా సుప్రీంకోర్టును లక్ష్యంగా చేసుకోవడం విస్మయం కలిగిస్తున్నది. న్యాయవ్యవస్థ చేసే వ్యాఖ్యలు అంతిమ తీర్పులో భాగం కావడం లేదని, అయినప్పటికీ వాటికి మీడియాలో చాలా ప్రచారం జరుగుతున్నదనే రాతలను ఎలా అర్థం చేసుకోవాలి? అక్కడ విధ్వంసం సాగిస్తున్నదే ప్రభుత్వమైతే, సుమోటోగా చేపట్టే ముందు ప్రభుత్వానికి చెప్పాల్సిన అవసరం లేదా? అని న్యాయస్థానాన్ని ప్రశ్నించడం అర్థం పర్థం లేని కుతర్కమే. ఇలాంటి పని అడ్డంగా సర్కారును వెనకేసుకువచ్చే తానా తందానాలు తప్ప మరొకరు చేయలేరు. సీఎం న్యాయవ్యవస్థను దిగజార్చేలా మాట్లాడుతుంటే, ప్రజా ప్రయోజనాలను కాపాడటంలో న్యాయస్థానాలు పోషించే కీలకపాత్రను నీరుగార్చే ధోరణిలో మీడియా వ్యాఖ్యలు చేయడం.. రెండూ దేశంలోని ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమే.

న్యాయస్థానాలపైనే 'చెత్త' పలుకులా?

డీఆర్‌సీ రావు

ఏ ఎండకా గొడుగు పట్టడంలో సిద్ధహస్తుడనని ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఎండీ వేమూరి రాధాకృష్ణ (ఆర్కే) మరోసారి రుజువు చేసుకున్నారు. చేతిలో ఒక పత్రిక, టీవీ చానెల్ ఉండటంతో తననొక రాజ్యాంగేతర శక్తిగా భావించుకుంటూ.. తన వర్గానికి అనుకూలమైన పరిణామాలైతే ఒకలాగా, గిట్టనివారి విషయంలో చాలా తేడాగా వండి వార్చడం ఆర్కేకు పరిపాటిగా మారింది. తన పత్రిక, టీవీ చానెళ్ళలో ప్రతీ వారం రాసే కొ(చె)త్తపలుకును నిశితంగా గమనిస్తే ఆర్కే అసలు స్వరూపం ఇట్టే బట్టబయలవుతుంది. తాజాగా హైదరాబాదు హెచ్.సి.యూలో 400 ఎకరాల భూ వివాదానికి సంబంధించిన కేసులో తెలంగాణ సీఎస్ తీరుపై సుప్రీంకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది.

గచ్చిబౌలి భూముల విషయంలో తమ ఆదేశాలను బేఖాతరు చేస్తే, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జైలుకు వెళ్లడానికి సిద్ధంగా ఉండాలని సుప్రీంకోర్టు న్యాయమూర్తులు గట్టి వార్నింగ్ ఇచ్చారు. ఈ పరిణామంతో రేవంత్ సర్కార్ పూర్తిగా ఆత్మరక్షణలో పడింది. సుప్రీం తీర్పుతో తదుపరి ఏమి చేయాలో అర్థం గాక సీఎం రేవంత్ అయోమయంలో పడ్డారు. సుప్రీం న్యాయమూర్తులు విచారణలో భాగంగా చేసిన వ్యాఖ్యలపై సీఎం రేవంత్ ఎలా ఫీలయ్యారో తెలియదు కానీ, సీఎంకు స్వయంప్రకటిత రాజగురువుగా ఫీలయ్యే ఆంధ్రజ్యోతి ఆర్కే మాత్రం బాగా హర్ట్ అయ్యారు. ఎంతగా అంటే.. సర్వోన్నత న్యాయస్థానం తీర్పుపై బహిరంగంగా అక్కసు వెళ్లగక్కేటంతగా. ఆర్కేను న్యాయమూర్తుల కామెంట్స్ అంతగా డిస్టర్బ్ చేసినట్లున్నాయి. ఈ వ్యాఖ్యలను ఉటంకిస్తూ ఆదివారం నాటి (ఏప్రిల్ 06, 2025) ఆర్కే కొత్తపలుకులో చేసిన వ్యాఖ్యలు ఆయనలోని నిస్పృహకు పరాకాష్ఠగా కనిపిస్తున్నాయి.

'కేసుల విచారణ సందర్భంగా న్యాయమూర్తులు చట్టాలను మాత్రమే సమీక్షించాలా? లేదా వ్యక్తిగత అభిప్రాయాలను కూడా జోడించవచ్చా? అన్నదానిపై కూడా న్యాయ నిపుణులలో కొంతకాలంగా చర్చ జరుగుతోంది. కేసుల విచారణ సందర్భంగా న్యాయమూర్తులు చేస్తున్న వ్యాఖ్యలు తుది తీర్పు లేదా ఆదేశాలలో భాగం కావడం లేదు. అయినప్పటికీ, మీడియాలో వాటికి విశేష ప్రచారం లభిస్తుండటంతో సామాన్య ప్రజానీకం ప్రభావితం అవుతున్నారు. సదరు వ్యాఖ్యలను తీర్పులలో భాగంగానే చూస్తున్నారు. ఈ పరిణామం న్యాయ వ్యవస్థ విశిష్టతకు నష్టం చేస్తుందన్న అభిప్రాయం బలంగా ఉంది' ఇవీ తాజాగా ఆర్కే తన కాలామ్‌లో పలికిన చెత్త పలుకులు.

ఈ సందర్భంగా ఇదే ఆర్కే తన ఆంధ్రజ్యోతి పత్రికలోనూ, ఏబీఎన్ ఛానల్‌లోనూ గతంలో జగన్ ప్రభుత్వంపై ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు చేసిన వ్యాఖ్యలపై పెద్దపెద్ద హెడ్డింగులు పెట్టి, వార్తలు రాసిన విషయాన్ని ఒకసారి గుర్తు చేసుకోవాలి. అమరావతి నుంచి రాజధానిని మార్చాలనుకోవడం మతిలేని చర్య అంటూ గతంలో హైకోర్టు న్యాయమూర్తి చేసిన వ్యాఖ్యలను ఆంధ్రజ్యోతి బాగా హైలైట్ చేసింది.

ఈ ఒక్క కేసులోనే కాకుండా పలు సందర్భాలలో జగన్ ప్రభుత్వాన్ని తప్పుబడుతూ హైకోర్టు న్యాయమూర్తులు చేసిన కామెంట్స్‌ను ఉటంకిస్తూ, ఆంధ్రజ్యోతిలో 3 మొట్టికాయలు, 6 తలంటుల్లు అనే హెడ్డింగ్ పెట్టి.. పెద్ద కథనాన్ని రాయించి రాధాకృష్ణ తెగ సంబరపడి పోయారు. ఆ రోజు ఆర్కేకు న్యాయమూర్తుల కామెంట్స్ భగవద్గీతలా వినిపించాయి. ఇప్పుడు రేవంత్ సర్కారును తప్పుబడితే మాత్రం అవి అనుచిత, అసందర్భ వ్యాఖ్యలన్నమాట. ఆర్కే జర్నలిజాన్ని చూస్తే.. ఊసరవెల్లి కూడా సిగ్గుపడుతుందేమో. ఈ చెత్త పలుకులో మరో విడ్డూరమైన వాదన ఏమిటంటే.. జగన్ సీఎంగా ఉన్నప్పుడు తన నివాసం కోసం రుషికొండను తొలిచేసి, పర్యావరణ నిబంధనలను కాలరాసినపుడు సుప్రీంకోర్టు దానిపై ఓ కమిటీని నియమించి వదిలేసిందని, హెచ్.సి.యూ భూముల కేసులో మాత్రం తెలంగాణ చీఫ్ సెక్రటరీకి ఎందుకు వార్నింగ్ ఇచ్చిందో అర్థం కావడం లేదని రాధాకృష్ణ మథనపడుతున్నారు. అంటే సుప్రీంకోర్టు న్యాయమూర్తులు విచారణ సందర్భంగా ఎలాంటి వ్యాఖ్యలు చేయాలో ఆర్కేని అడిగి, నేర్చుకోవాలన్న మాట. ఇలాగే వదిలేస్తే, రాధాకృష్ణ తన చెత్త పలుకుల ముసుగులో సుప్రీంకోర్టు తీర్పులు ఎలా ఉండాలో కూడా చెబుతారేమో. గతంలో ఓ సందర్భంలో మీడియా నియంత్రణపై హైకోర్టు న్యాయమూర్తి వ్యాఖ్యలు చేసినప్పుడు ఆంధ్రజ్యోతి కథనం ద్వారా ఆర్కే తీవ్రంగా స్పందించారు. రాజ్యాంగంలోని ప్రతీ వ్యవస్థ తన పరిధిని, లక్ష్మణ రేఖను దాటకపోవడం శ్రేయస్కరమని ఆ కథనంలో రాధాకృష్ణ కర్తవ్యబోధ చేశారు. మరి అదే లాజిక్ ఇప్పుడు ఆర్కేకి కూడా వర్తిస్తుంది కదా! అయినా గతంలో జడ్జీలు ఎందుకు ఇలాంటి ఆదేశాలిచ్చారు.. ఇప్పుడు వారి ఉత్తర్వులు మరోలా ఎందుకు ఉన్నాయంటూ న్యాయ వ్యవస్థను ప్రశ్నించే అధికారం ఆర్కేకు ఎవరిచ్చారు? కింది కోర్టు నుంచి పైకోర్టుకు అప్పీలుకు వెళ్ళినప్పుడు గానీ, జడ్జీలు మరే కారణం వల్లగానీ సందర్భాన్ని బట్టి న్యాయమూర్తుల ఉత్తర్వులలో మార్పు ఉండవచ్చు. అంతమాత్రం చేత తనకు అనుకూలమైన రేవంత్ రెడ్డి వంటి వ్యక్తులకు ప్రతికూలమైన ఆదేశాలిస్తే.. వెంటనే సుప్రీంకోర్టు న్యాయమూర్తుల నిబద్ధతపై అనుమానాలు సృష్టించే రీతిలో రాధాకృష్ణ చెత్తపలుకులు' వండి వార్చడం ఏమిటి? ఇది ఆయనకు అలవాటైనట్టు కనిపిస్తున్నది.

(కొ)చెత్త పలుకులో రాసిన ఓ లైన్‌లో 'తాను చేస్తే శృంగారం... ఎదుటివారు చేస్తే వ్యభిచారం అనేవిధంగా తెలంగాణలో ప్రతిపక్షాల వైఖరి ఉంద'ని ఆర్కే తన ఆక్రోశాన్ని వెళ్లగక్కారు. తాజాగా రాధాకృష్ణ విశ్లేషణను చదివితే, ఆయన రాస్తున్న తీరు శృంగారమా లేక రేవంత్ సర్కారు తప్పు చేస్తున్నా, అడ్డగోలుగా సమర్థించడాన్ని వ్యభిచారం కింద పరిగణించాలో స్పష్టత ఇవ్వాల్సిన బాధ్యత ఆర్కేదే.

అమ్మకానికి నమ్మకం!

ప్రజా పాలనలో ఇటు వందేండ్ల చరిత్ర కలిగిన ఉస్మానియా యూనివర్సిటీలో అప్రజాస్వామిక పద్ధతుల్లో నిషేధ ఆంక్షలు కొనసాగుతుండగానే, అటు హైదరాబాద్ సెంట్రల్ వర్సిటీకి సంబంధించిన 400 ఎకరాల భూములు అమ్మకానికి పెడటం విద్యార్థుల ఆగ్రహానికి కారణమైంది. పాలకుల నియంతృత్వ వైఖరులను నిరసిస్తూ ఈ రెండు వర్సిటీల్లో కొన్నిరోజులు విద్యార్థులు పలు రూపాల్లో నిరసనలు తెలిపారు. ఫలితంగా వారు పోలీసు దాడులు, అరెస్టులు, కేసులనూ ఎదుర్కొన్నారు.

'ప్రజా పాలన'లో వర్సిటీలకు జరుగుతున్న అన్యాయంపై విద్యార్థి లోకం ఇంతలా గొంతెత్తినా, కొన్ని ప్రధాన మీడియా సంస్థలు, కొంతమంది మేధావులకు చీమకుట్టినట్టు కూడా లేదు. పాలకులు యథేచ్ఛగా 'ఏడో గ్యారంటీ'కి సమాధి కడుతుంటే.. బుల్డోజర్ల సంస్కృతిని బాహాటంగా ప్రవేశపెడుతుంటే.. ఈ విధానం తప్పు అంటూ నిలదీయాల్సిన సదరు సంస్థలు, మేధావులు మౌనం వహించడం అత్యంత బాధాకరం. ఓయూలో సమస్యలు విలయతాండవం చేస్తున్నాయి. తక్షణమే ప్రక్షాళన చేయాలని సూచిస్తూ ఇటీవల రాష్ట్ర విద్యాశాఖ కమిషన్ సైతం ప్రభుత్వానికి తమ నివేదికను అందించింది. ఆ సమస్యలు పరిష్కరించండంటూ గత కొంతకాలంగా విద్యార్థులు శాంతియుత పద్ధతుల్లో ఆందోళనలు చేపట్టారు. అయితే, పరిష్కారం చూపని అధికారులు 5 రకాల చర్యలను నిషేధిస్తూ సర్క్యులర్‌ను విడుదల చేసిన విషయం విదితమే. ఇది అప్రజాస్వామికం కాదా? వందేండ్ల ఓయూ చరిత్రలో ఈ తరహా సర్క్యులర్ జారీ కావడం ఇదే మొదటిసారి. గత పదేండ్ల పాటు 'ఊ' అంటే ఉస్మానియాకు ఉర్కొచ్చి తాము 'ప్రశ్నించే గొంతుకలం', 'పాటగాళ్లం', 'మేధావు లం', 'నికార్సయిన జర్నలిస్టులం' అంటూ చెప్పుకున్నవారు ఇప్పుడు ఓయూ పరిసరాల్లోకి కూడా రావడం లేదు. బహుశా పదవులు రాగానే కొంతమంది పెదాలు మూసుకుపోయి ఉంటాయి. ప్రత్యేక కథనాలు, ప్రాధాన్యం లేకున్నా ప్రత్యక్ష ప్రసారాలు చేసిన పలు బడా మీడియా సంస్థలు (నమస్తే తెలంగాణ కాదు) ఇప్పుడు కొనసాగుతున్న అప్రజాస్వామిక చర్యలను సమాజానికి చూపేందుకు ఉద్యమాల గడ్డ వైపునకు కనీసం కన్నెత్తి చూడటం లేదు. అంటే, వ్యక్తిగత ప్రయోజనాల దృష్ట్యా 'ప్రశ్న' కూడా సందర్భాన్ని బట్టి మారుతుందా? సమాధానం చెప్పాలి.

పోరాటాల మూలంగానే హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) పురుడు పోసుకున్నది. నాటి ప్రధాని ఇందిరాగాంధీ ప్రత్యేక శ్రద్ధ వహించారు. సిక్స్ పాయింట్ ఫార్ములాలో భాగంగా వర్సిటీని నెలకొల్పారు. చట్టపరమైన సమస్యలు తలెత్తకుండా 32వ రాజ్యాంగ సవరణ ద్వారా చట్టబద్ధత కల్పించారు. అయితే, భూమిని మాత్రం యూనివర్సిటీ పేరున రిజిస్ట్రేషన్ కాని, లీజు డీడ్ కాని చేయించలేదు. బహుశా వర్సిటీ భూములు లాక్కునే నేతలు పుట్టుకొస్తారని నాడు ఊహించి ఉండరు. అకడమిక్ అవసరాల కోసమే భూమిని వినియోగించాలనే నిబంధనను మాత్రం పొందుపర్చారు. రాష్ట్ర విభజన అనంతరం కూడా స్వయం ప్రతిపత్తికి ఎప్పుడు ఇబ్బంది కలగలేదు. కానీ, యాభై ఏండ్ల తర్వాత 'ఇందిరమ్మ రాజ్యం' అని చెప్పుకొంటున్న పాలకులు ఒక సాంకేతిక లోపాన్ని సాకుగా చూపుతూ.. కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూమి ప్రభుత్వానిది అంటూ విక్రయ ప్రయత్నాలకు సిద్ధమవ్వడం దారుణం.

1974 నుంచి ఇప్పటివరకు దశాబ్దాల కాలం పాలించిన కాంగ్రెస్ ఈ వర్సిటీకి ఎలాంటి భూ యాజమాన్య హక్కు కల్పిస్తూ సాధికార పత్రాలు ఇవ్వలేదు. ఇప్పుడున్న మొత్తం భూములకూ పత్రాల్లేవు, చాలా వర్సిటీల పరిస్థితి కూడా ఇదే. అంటే, సాంకేతిక కారణాలను చూపుతూ తిరిగి భూములు లాగేసుకుంటారా? ఆధునిక మేధావులను అందించే వర్సిటీలను నిర్వీర్యం చేస్తారా? సెంట్రల్ వర్సిటీ పర్యావరణం.. రాజధాని హైదరాబాద్‌కు ఊపిరితిత్తుల్లా పనిచేస్తుంది. ప్రభుత్వ రికార్డుల్లో అటవీ ప్రాంతంగా నమోదు కాకపోయినప్పటికీ.. తిరుమల్ పాడ్ వర్సెస్ కేంద్ర ప్రభుత్వ కేసులో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం.. చెట్లు, పక్షులున్న ప్రాంతాన్ని అటవీ ప్రాంతంగానే పరిగణించాల్సి ఉన్నది. అభివృద్ధి పనుల పేరుతో కేటాయింపులు జరుపుతున్నప్పుడు కమిటీ వేసి అధ్యయనం చేయాలి. ఇవేమీ పట్టించుకోకుండా టీజీఐఐటీ మాత్రం పర్యావరణ నిబంధనలను తుంగలో తొక్కి చట్టవిరుద్ధంగా ప్రవర్తిస్తున్నది. ఉపాధి, అభివృద్ధి కోసమే అయితే ఫ్యూచర్ సిటీ, ఫార్మా సిటీల్లో గల విశాలమైన భూములను వినియోగించుకోవచ్చు. ఇక్కడే మనం పాలనాదక్షులకు, రియల్ వ్యాపార స్వభావం కలిగిన పాలకుడికి మధ్య ఉన్న తేడాను గమనించాలి. శాంతియుత పద్ధతుల్లో విద్యార్థులు ఆందోళనలు చేస్తుంటే పాలకులు మాత్రం రాజకీయాలకు ముడిపెట్టడం రేవంత్ సహజ స్వభావాన్ని గుర్తు చేస్తున్నది.

ఓయూలో ఇప్పుడు నిషేధ ఆంక్షలు విధింపజేశారు. మౌనం వహిస్తే భవిష్యత్తులో ఇక్కడి భూములను సైతం బజారులో అమ్మకానికి పెడతారేమో! కాబట్టి, విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి. ఈ రెండు వర్సిటీల్లో ఏకకాలంలో కొనసాగుతున్న న్యాయబద్ధమైన పోరాటాలకు సమాజంతో పాటు అరణ్యంలో ఉన్న భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) కూడా మద్దతు తెలుపుతూ ప్రభుత్వ తీరును ఎండగట్టింది. జనారణ్యంలో ఉన్న కొంతమంది మేధావులు మాత్రం మౌనం వీడటం లేదు. మేధావుల మౌనం సమాజానికి పెను ప్రమాదం. కావున, వారంతా బహిరంగంగా తమ వాణి వినిపించాలి. తెలంగాణ ఉద్యమ సమయం, స్వరాష్ట్ర సాధన అనంతరం విషం చిమ్మిన పలు మీడియా సంస్థలు ఇప్పుడు ప్రభుత్వం చేసేది కరెక్టు అనే రీతిలో ప్రచారం చేయడం మానుకోవాలి. 'నిజం కూడా ప్రతి రోజు ప్రచారంలో ఉండాలి. లేకుంటే, అబద్ధమే నిజంగా మారి ప్రపంచాన్ని నాశనం చేస్తుంది' అన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మాటలను విద్యార్థులు గుర్తెరగాలి. వర్సిటీల్లో రేవంత్ సర్కార్ అవలంబిస్తున్న నియంతృత్వ పోకడలపై భారత రాజ్యాంగం చేబూని నిత్యం సంచరిస్తున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ స్పందించాలి. ఉన్నత విద్య ఆవశ్యకతను వివరిస్తూ, వర్సిటీ భూముల వేలాన్ని ఆపేలా రేవంత్‌ను మందలించాలి. లేదంటే, తెలంగాణలో విద్యార్థి ఉద్యమాలకు మహోన్నత చరిత్ర ఉన్నది. కాబట్టి, పాలకుల మెడలు వంచి వర్సిటీలను కాపాడుకునేందుకు సైతం వెనుకడుగు వేయం.

నరేష్ పాపట్ల
95054 75431

(వ్యాసకర్త: సోషియాలజీ విద్యార్థి, ఓయూ జాక్ నాయకుడు)

రాహుల్ మౌనానికి కారణాలు?

టంకశాల అశోక్

తెలంగాణ పరిణామాలు, ఘటనల పట్ల కాంగ్రెస్ అగ్ర నాయకుడు రాహుల్‌గాంధీ స్పందించాలనే మాటలు వేర్వేరు వైపుల నుంచి కొన్ని నెలలుగా వినవస్తున్నాయి. కానీ ఆయన నుంచి ఎటువంటి కదలికలు కన్పించటం లేదు. అందుకు కారణాలు ఏమై ఉంటాయని ఆలోచించగా ప్రధానమైనవి మూడు కనిపిస్తున్నాయి. ఒకటి, తమకు ఇక్కడ కావలసింది అధికారమే తప్ప ప్రజల బాగోగులు కాదు. రెండు, ఏ జోక్యం చేసుకున్నా పార్టీలో బలమైన వర్గాలు చెదిరిపోయి తమ పార్టీ ప్రభుత్వానికి ముప్పు రాగలదేమోననే భయం. మూడు, మౌలికమైన స్థాయిలో తన అసమర్థత. ఇటువంటివి లేనట్లయితే ఆయన జోక్యం చేసుకొని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, తన పరిపాలనను చక్కదిద్దేందుకు ఎప్పుడో పూనుకోవలసింది.

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 16 నెలలు గడిచింది. ఒక వైపు పరిపాలన అస్తవ్యస్తంగా మారుతూ ప్రజల్లో అసంతృప్తి తలెత్తటం, మరొకవైపు ముఖ్యమంత్రి వ్యక్తిగత వ్యవహారణపై విమర్శలు రావటం నాలుగైదు నెలలు గడిచేసరికి కనిపించసాగాయి. ప్రతిపక్షాలను పక్కన ఉంచుదాం. కేవలం వాటిని విస్మరించినట్లయితే రాహుల్‌గాంధీని అంతగా అనవలసింది ఉండదు. ప్రతిపక్షాలు ఎప్పుడూ అంతే లెమ్మని తోసివేసే వీలు ఆయనకు ఉంటుంది. కాని జరుగుతూ వచ్చింది అది కాదు. వాస్తవానికి ప్రతిపక్షాలు వెంటనే విమర్శలు చేసినట్లయితే, కొత్త ప్రభుత్వాన్ని కాస్త కుదురుకోనివ్వరా అనే మాట ప్రజల నుంచి రాగలదు గనుకనే అవి తగినంతకాలం చెదురుమదురుగా తప్ప విమర్శలు చేయలేదు. ప్రజలకు కూడా అది ఇంకా వేచి చూసే దశగానే గడిచింది. ఆ కాలమంతా ఎవరూ రాహుల్‌గాంధీ ఎక్కడనే ప్రశ్నలు వేయలేదు కూడా.

ఆ తర్వాత పరిస్థితి మారటం మొదలైంది. రేవంత్ రెడ్డి మాటల తీరు సరేసరి కాగా, అంతకన్న ముందుగా ప్రజలు మాట్లాడటం మొదలైంది కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలుకాకపోవటం గురించి. అవి వారి నిత్య జీవిత సమస్యలు గనుక. వాటిని నమ్మినందువల్లనే కాంగ్రెస్‌కు ఓటు వేశారు గనుక. హామీలు సాధారణమైనవి కావు. వాటిని ఎప్పుడూ ఏ పార్టీ చేయనివిధంగా బాండ్ పేపర్లపై సంతకాలు చేసి ఇంటింటికి తిరిగి పంచారు. ఆ ప్రకటనలు స్థానిక నాయకులు గాక సాక్షాత్తూ నెహ్రూ-గాంధీ వంశానికి చెందిన సోనియా గాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంకా గాంధీలు తెలంగాణలో పర్యటించి సభలలో పాల్గొంటూ డిక్లరేషన్ల రూపంలో, మ్యానిఫెస్టో రూపంలో, బాండ్ల రూపంలో చేశారు. హామీల అమలుకు నిర్దిష్టమైన గడువులు విధించారు. వాటి అమలు బాధ్యత స్వయంగా తమదన్నారు. ఆ విషయంలో తాము ఢిల్లీలో తెలంగాణ ప్రజల ప్రతినిధుల వలె వ్యవహరించగలమన్నారు. ఒక చిన్న పిల్లవాడికి ఫిర్యాదున్నా వెంటనే హైదరాబాద్‌కు రాగలమని భరోసా ఇచ్చారు. మనకు తెలిసి ఒక ఎన్నిక విషయంలో ఏ పార్టీ అయినా సరే ఇన్నిన్ని చేయటం ఎప్పుడూ, ఎక్కడా జరగలేదు. ఇవన్నీ కలగలసినప్పుడు ప్రజలు నమ్మకుండా ఉండటం తేలిక కాదు. అందువల్లనే కాంగ్రెస్ గెలిచింది.

అందరికీ తెలిసిన విషయాలనే ఇట్లా గుర్తు చేసుకోవటం ఎందుకంటే, అందుకు ఒక సందర్భం ఉన్నది గనుక. అది, ప్రజలకు ఇన్నిన్ని నమ్మబలికిన రాహుల్‌గాంధీ, ఈ విషయాలపై ప్రజల నుంచి నిరంతరం ఫిర్యాదులు, విమర్శలు వస్తున్నా, ఇటువైపు ఒక్కటంటే ఒక్కసారైనా మొహం చూపకపోవటం. వాస్తవానికి ప్రజలతో నమ్మబలికింది మొత్తం కుటుంబం కలిసికట్టుగా అయినందున వారంతా ఇటురావటం ప్రజల పట్ల రాజకీయ బాధ్యతే గాక నైతిక బాధ్యత కూడా. కనీసం రాహుల్‌గాంధీ అయినా ఆ పని చేయాలి. ఒక్కసారి కాదు, తరచుగా. అయినప్పటికీ ఒక్కసారైనా ఆ పని చేయలేదు. ఇక్కడ హామీలు అమలు కాకపోవటం విషయంలోనే కాదు.

మూసీ జోనీబీలు, గిరిజనుల భూముల ఆక్రమణలు, వాలిపై అర్ధరాత్రి దాడులు, రైతుల ఆత్మహత్యలు, నిరుద్యోగుల ఆందోళనల నుంచి మొదలుకొని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో వందలాది ఎకరాల అర్ధరాత్రి విధ్వంసం, వన్యప్రాణులపై హింస వరకు తరచు చోటుచేసుకుంటూ వస్తున్న అనేక సందర్భాల్లో కూడా రాహుల్ ఎక్కడ అనే ప్రశ్నలు వినరావటం ఎక్కువవుతున్నది. ఈ మాట మొదట ప్రతిపక్షాల నుంచి రాగా, తర్వాత వివిధ ప్రజా వర్గాల నుంచి అంతకుమించి వస్తున్నది.

అయినప్పటికీ రాహుల్‌గాంధీ ఇటు రాకపోవటం సరి కదా, కనీసం ఢిల్లీ నుంచి ఒకమాటైనా పలెత్తి అనటం లేదు. ప్రజలు మంచి వారు, అల్ప సంతోషులు. రాహుల్ ఇక్కడకు రావటం వల్ల సమస్యలు తీరకపోయినా, తీరేటట్లు చూస్తానని మాట్లాడిపోతే నెమ్మదిస్తారు. అట్లా రానప్పుడు కనీసం రానైనా లేదని

నొచ్చుకుంటారు. నిరసనభావం పెరుగుతుంది. ఆ నిరసన రాష్ట్ర నాయకత్వానికి పరిమితమయ్యే బదులు గాంధీ కుటుంబానికి విస్తరిస్తుంది. ఇప్పుడది జరుగుతున్నది. ఎన్నికల సమయంలో ఆ కుటుంబానికి చెందిన తల్లీ పిల్లలంతా వచ్చినప్పుడు ప్రజలకు ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ గుర్తుకువచ్చి కొంత మురిశారు కూడా. తర్వాత ప్రభుత్వం ఏర్పడి నెలలు గడిచే కొద్దీ ఆ మురిపెం, నమ్మకం నిరసనగా మారుతున్నాయి. రాష్ట్ర నాయకత్వంతో పాటు అధిష్ఠానం పట్ల కూడా నిరసన కలిగితే ఇక మిగిలేదేమున్నది. దీనంతటికీ రేవంత్ రెడ్డి అసభ్యకరమైన మాటలు తోడవుతున్నాయి. అందుగురించి నగరాల నుంచి గ్రామాల వరకు, ఉన్నతవర్గాల నుంచి సాధారణ ప్రజల దాకా ఆయనను విమర్శించనివారు కనిపించటం లేదు.

ఈ విధంగా రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలు, ముఖ్యమంత్రి వ్యక్తిగత లోటుపాట్లతో పాటు స్వయంగా తమపై వస్తున్న విమర్శల గురించి సోనియా, రాహుల్, ప్రియాంకలకు తెలియదా? అట్లా ఎంతమాత్రం అనుకోలేము. వారికి సమాచారాలు ఎప్పటికప్పుడు వేర్వేరు మార్గాలలో తెలుస్తూనే ఉంటాయి. పైగా రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల పర్యవేక్షణకు ఒకరిని ఏఐసీసీ నుంచి ప్రత్యేకంగా నియమిస్తారన్నది తెలిసిందే. ప్రస్తుతం ఒక సోకాల్డ్ గాంధియన్ మహిళ ఆ పనిలో ఉన్నారు. కనుక ఇందులో సమస్య లేదు. సమస్యంతా తమకు చేరే సమాచారాన్ని బట్టి ఏమి చేస్తున్నారన్నదే. మంచో, చెడ